మే గండం గట్టెక్కేనా..?

- మరింత పెరగనున్న నీటి కష్టాలు
- ట్యాంకర్లతో సరఫరా చేసేందుకు అధికారుల కసరత్తు
- పలు గ్రామాల్లో జేజేఎం కింద ప్రారంభం కాని పనులు

పాణ్యం: వేసవి కాలం వచ్చిందటే ప్రధానంగా ఎదురయ్యే సమస్య నీటి ఎద్దడి. వేసవిలో అత్యంత కఠినమైన నెల మే. ఈ నెలలో ఎండల తీవ్రతతో పాటు, నీటి కష్టాలు అధికంగా ఉంటాయి. ఈ నెలను గట్టెక్కేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఏప్రిల్ నుంచి పిన్నాపురం గ్రామంలో సోలార్ పరిశ్రమం సహాయంతో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. గ్రామంలోని కొత్త బిల్డింగ్‌ల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో అధికారులు ప్రతి రోజు నాలుగు ట్యాంకర్లతో ప్రజల గొంతు తడుపుతున్నారు. మే నెలలో భూగర్భ జలాలు మరింత ఇంకిపోవడమే గాక, నీటి ఎద్దడిలో మరిన్ని గ్రామాలు చేరతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

తాగునీటి వనరుల ఇవే

ప్రస్తుతం మండల ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో 183 చేతిపంపులు ఉండగా 110 మాత్రమే పని చేస్తున్నాయి. అలాగే 37 ఓహెచ్ ఎస్ఆర్ ట్యాంకులు ఉండగా వాటి ద్వారా కుళాయిలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అలాగే అహల్యాపురం గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా నాలుగు గ్రామాలకు నీరు అందిస్తున్నారు.



భూపనపాడులో చేతి పంపును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

నీటి సమస్య ఎదురయ్యే గ్రామాల గుర్తింపు

మండలంలో మే నెలలో నీటి సమస్య ఎదురయ్యే గ్రామాలను గుర్తించినట్లు అధికారులు చెప్పారు. ప్రధానంగా తమరాజుపల్లె, తొగర్చేడు, పాణ్యం బీసీ కాలనీ, బోయపేటలో నీటి సమస్య గతంలో ఎదురు కావడంతో ఈసారి కూడా ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

ప్రారంభం కాని జేజేఎం పనులు

మండలంలోని గ్రామాలకు తాగునీరు అందించేందుకు నిర్వహించ తలపెట్టిన జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పనులు స్థలం చూపించని కారణంగా నిలిచిపోయాయి. కొలూరు గ్రామంలో జేజేఎం కింద రూ.36 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంక్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

- పాణ్యంలో జేజేఎం కింద రూ.కోటి నిధులతో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌తో పాటు కుళాయిల కనెక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది.
- భూపనపాడు గ్రామానికి రూ.86 లక్షలతో జేజేఎం కింద 60 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్, పైపులైన్ పనులు చేయాల్సి ఉండగా వీటికి స్థలం కేటాయించని కారణంగా అలాగే ఉండిపోయాయి.

దీంతో నీటి సమస్య మరింత జటిలమైంది.

ట్యాంకర్లతో నీటి సరఫరా

మండలంలో మే నెలలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్లతో ప్రజలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్పంచ్‌లతో మాట్లాడి నీటి ఇబ్బంది తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాం. నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉంది. స్థలం కేటాయిస్తే జేజేఎం పనులు చేపడతాం.

– మధుశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

క్లుప్తంగా

కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం



మూల పెద్దమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ వారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ రామలింగారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రీసర్వే పక్కాగా చేపట్టండి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ సందీప్‌కుమార్

ఓర్వకల్లు: మండల పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆర్‌డీఓ సందీప్ కుమార్ ఆదేశించారు. మంగళవారం రీ సర్వే పనులను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. రీసర్వే పనుల్లో భాగంగా రైతులకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. రైతుల సమ్మతితో ఆధారాలను పరిశీలించి సర్వే చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



టైలరింగ్ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న పీడీ రమణారెడ్డి

ఓర్వకల్లు: ప్రభుత్వం బీసీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పీడీ రమణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఉశేనాపురం గ్రామంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. 35 మందికి నెల రోజుల పాటు శిక్షణ జరుగుతుందన్నారు. బ్లౌజులు, టాప్‌లు కుట్టడం వంటివి నేర్చుకోవడం జరిగిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు యూనిఫాంలు అందజేశారు. జిల్లా డీపీఎం నరసమ్మ, డీపీఎం ఐబీ హజరత్, ఆర్ శెట్టి, ట్రైనర్ రమేష్, ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఈ శుభకుమార్

పాణ్యం: మండలంలోని డొంగు నుంచి దుర్వేశి మెట్ట వరకు రూ.5 కోట్లతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని ఈఈ శుభకుమార్ సూచించారు. ఆయన మంగళవారం సిబ్బందితో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.రోడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను పరీక్షించారు. ప్రస్తుతం కాంక్రీట్ వాల్స్, బ్రిడ్జిలు, కంకర పరచడం లాంటి పనులు జరుగుతున్న నేపథ్యంలో వాటి నాణ్యతను తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

పల్లెల్లో జోరుగా మద్యం



కొలురులో ఇళ్ల మధ్యనే మద్యం సీసాలు

పాణ్యం: కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ వారే బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అందుబాటులో మద్యం దొరుకుతుండటంతో మందుబాబులకు మరింత స్వేచ్ఛ వచ్చింది. ఏకంగా ఇళ్ల మధ్యనే మద్యం సేవిస్తున్నారు. కొలురు గ్రామంలో చీకటి పడిందంటే చాలు మందుబాబులు హల్‌చల్ చేస్తుంటారు. ఏకంగా ఇళ్ల మధ్యలోనే మద్యం సేవిస్తున్నారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మోడల్ చెరువుగా కొండజూటూరు ఎంపిక



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ నాగమణీశ్వరి

పాణ్యం: జిల్లాలో చెరువుల అభివృద్ధికి పైలెట్ గ్రామంగా కొండజూటూరును ఎంపిక చేసినట్లు డీఎఫ్‌ఓ నాగమణీశ్వరి తెలిపారు. మంగళవారం గ్రామంలో చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగేళ్లలో ప్రణాళిక ప్రకారం చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామస్తుల నుంచి, రైతుల నుంచి సమస్య లు తెలుసుకున్నారు. చెరువు తూముల మరమ్మ తులు, చెరువును శుభ్రం చేయడం, ఆక్రమణలు తొలగించడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మైనర్ ఇరిగేషన్, అటవీ శాఖ,రెవెన్యూ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. చెరువు అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. చైర్మన్ యాకూబ్, సబ్ డీఎఫ్‌ఓ సూర్య చంద్రరాజు, ఎఫ్ఆర్‌ఓ ప్రవీణ్, చిన్న నీటి పారుదల శాఖ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, ఆర్ఐ రాము, కమిటీ సభ్యులు గంగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి తొట్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



వర్కూరులో నీటితొట్టిని పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: వేసవిలో పశువుల దాహార్తి తీర్చడం కోసం మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న నీటితొట్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన నీటి తొట్టిని ఏపీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ మండలంలోని అమడగుంట్ల, ప్యాలకుర్తి, పులకుర్తి, కల్లపరి, గోరంట్ల, లద్దగిరి, ముడుమలగుర్తి, వర్కూరు, కోడుమూరులలో పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం 10 నీటి తొట్లను మంజూరు చేసిందన్నారు. ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి రూ.32 వేలు మంజూరయ్యాయని, ప్రస్తుతానికి మండలంలో ఐదు నీటి తొట్ల నిర్మాణాలు పూర్తవ్వగా, మిగిలిన ఐదింటి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అంతకుముందు ఏపీఓ మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేసి కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 వరకు వస్తుందని చెప్పారు. వేసవి దృష్ట్యా పనిచేసే ప్రదేశంలో కూలీలకు అవసరమైన మంచినీరు, నీడ వసతిని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలి



డీఎల్‌పీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(రూరల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటిస్థలంతో పాటు నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బి.తాండ్రపాడు గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 342 ఎ లో గత రెండు సంవత్సరాల నుంచి కొట్టాలు వెసుకొని జీవిస్తున్నారు. ఈస్థలాన్ని డివిజన్ లెవల్ పంచాయతీ అధికారి లక్ష్మీ బుధవారం పరిశీలించారు. ఆమెను సీపీఐ నాయకుల కలిసి పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే ప్రస్తుత నివాస ప్రాంతంలో కనీస సౌకర్యాల కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.రామకృష్ణారెడ్డి, మహేష్, నాగరాజు, ప్రసాద్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తేవాలి

సి.బెళగల్: సంపద తయారి కేంద్రాలను వినియోగంలోకి తేవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ రంగనాథబాబు సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌కు చెందిన సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామ సర్పంచ్ పాండురంగన్న చేపట్టిన ఎరువులో వానపాముల విడుదలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామితో మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి అక్కడ ఎరువులు తయారు చేయాలన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ రంగనాథబాబు

సి.బెళగల్: మండల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ రంగనాథబాబు సూచించారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాలలో జరుగుతున్న పనులపై సమీక్షించారు. అధికార యంత్రాంగం రెగ్యులర్‌గా విధులకు హాజరై గ్రామాలను సందర్శించాలని, పల్లెల్లో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అధికారుల అనుమతులు, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అయితే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను డీడీ ఆదేశించారు. హౌసింగ్, ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి తదితర శాఖలలో ప్రస్తుత జరుగుతున్న కార్యక్రమాలపై చర్చించారు. కొన్ని శాఖల అధికారుల తీరు, పంచాయతీ కార్యదర్శుల పనితీరు అధ్వానంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పీఆర్, విద్యుత్, ఇరిగేషన్ ఏఈలు గోసేనాయక్, సుమంత్, వెంకటప్రకాష్, సుకుమార్, సూర్యప్రకాష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఎంఈఓ – 2 ఆదామ్‌బాషా, సి.బెళగల్, కొత్తకోట పశు వైద్యులు ప్రవీణ్‌కుమార్, సుంకన్న, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఉపాధిహామీ ఈసీ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెస్ట్ కంట్రోల్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీలో పనిచేస్తున్న ఉద్యోగి మహేష్ ఆత్మహత్యాయత్నం చేశారు. మూడు రోజులుగా సెలవులో ఉన్న ఆయన మంగళవారం రాత్రి ఆసుపత్రికి వచ్చి పెస్ట్ కంట్రోల్ కార్యాలయంలోని బీరువాలో ఉన్న ఎలుకల సంహారక మందును తీసుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. క్యాజువాలిటీలో అత్యవసర చికిత్స అందించిన వైద్యులు అతన్ని మెడికల్ వార్డులో అడ్మిట్ చేశారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం ఆయన్ను బుధవారం పరామర్శించారు. ఓ ఉద్యోగి వేధింపుల వల్లే తాను ఆత్మహత్యకు యత్నించినట్లు బాధితుడు అధికారులకు తెలిపినట్లు సమాచారం.

సారా విక్రేతలపై బైండోవర్ కేసు

కర్నూలు: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయదారులు 12 మందిపై ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఓర్వకల్లు మండలం కోమరోలు గ్రామానికి చెందిన రవికుమార్, పెద్ద మద్దిలేటి, మద్దిలేటి, లక్ష్మయ్య, లొద్దిపల్లెకు చెందిన శివకుమార్, నిర్మల కుమార్, పెద్దపల్లి మద్దిలేటి, ఉప్పలపాడుకు చెందిన లక్ష్మీదేవి, కాల్వబుగ్గకు చెందిన రామేశ్వరమ్మ, నాగమద్దయ్య, సోమయాజులపల్లెకు చెందిన లక్ష్మయ్య, శేషాద్రి తదితరులపై బైండోవర్ కేసులు నమోదు చేసి ఓర్వకల్లు తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఇకపై సారా రవాణా, విక్రయాలు జరిపితే రూ.లక్ష జరిమానా కట్టవలసి ఉంటుందని, వ్యక్తిగత బాండ్‌తో బైండోవర్ చేసినట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నందీశ్వర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

2న ఆర్‌యూ పీజీ విద్యార్థుల ఫేర్‌వెల్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, సైన్స్ కళాశాలల పీజీ విద్యార్థులకు మే 2వ తేదీన వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినట్లు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు పేర్కొన్నారు. ఫేర్‌వెల్ డేను పురస్కరించుకొని ఆర్‌యూ మైదానంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. శారీరక శ్రమను జీవన శైలిలో భాగం చేసుకున్నప్పుడే ఆరోగ్యవంతులవుతారన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, క్రీడల కమిటీ కన్వీనర్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పీవీ సుందరానంద్ పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికపై శిక్షణ



మాట్లాడుతున్న ఏడీ రాజశేఖర్

పాణ్యం: 2025 ఖరీఫ్ పంటల సాగు ప్రణాళికపై వ్యవసాయ అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఖరీఫ్ సీజన్ పంటల సాగు ప్రణాళిక తయారు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. గత ఖరీఫ్‌లో సాగు చేయని బీడు భూములను ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పొలాలు ఖాళీగా ఉండేందుకు వీల్లేదని, పంటల సాగుపై ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పంటల సాగు ప్రణాళిక విధానం, ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని వివరించారు. రైతు సేవా కేంద్రాల వారీగా భూసార పరీక్షల నమూనాల సేకరణ, యాప్‌లో నమోదు చేసే విధానంపై అవగాహన కల్పించామన్నారు. మండలంలో 597 నమూనాల సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా 15 హెక్టార్లకు ఒకటి చొప్పున మట్టి నమూనాలు సేకరించాలన్నారు. వచ్చే నెల 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఓ జయప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి, మండల ఏఎస్‌ఓ మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు, రెవెన్యూ అధికారులు, బహుళ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



ఓర్వకల్లు సీహెచ్‌సీలో వసతులను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు

ఓర్వకల్లు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. ఓర్వకల్లులోని సీహెచ్‌సీని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలపై వారిని అడిగి తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సర్వే నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలను చేపడుతోందని చెప్పారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి సేవలు అందేలా వైద్య సిబ్బంది చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్లకు సూచించారు.



తహసీల్దార్ చాంబర్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం,



ఖాళీగా మండల సర్వేయర్, రీసర్వే డీటీ చాంబర్

సారొళ్లు ఎప్పుడొస్తారో!

సిబెళగల్: ప్రజలకు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాల్సిన రెవెన్యూ అధికారులు సమయ పాలన పాటించడం లేదు. దీంతో వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సమయానికి ఏ ఒక్క అధికారి రాలేదు. డిప్యూటీ తహసీల్దార్ (ఇన్‌చార్జ్ తహసీల్దార్), రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, ఏఎస్‌ఓ తదితర మండల స్థాయి అధికారులతో పాటు మిగతా సిబ్బంది 11 గంటలైనా కార్యాలయానికి రాలేదు. దీంతో వారి చాంబర్‌లలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జూనియర్ అసిస్టెంట్ మధు మాత్రమే నిర్ణీత సమయంలో విధులకు హాజరు అయ్యాడు. అధికారుల సంతకాల కోసం, భూ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు, రైతులు అధికారుల కోసం గంటల తరబడి ఎదురు చూశారు.

మేడేను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ

కోడుమూరు రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే1వ తేదీన నిర్వహించే వేడుకల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో హమాలీ, ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్రిష్ణ మాట్లడుతూ మేడే ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ఎర్రజెండాలను ఎగురవేయాలని, కార్మికులంతా ఎర్రటి దుస్తులు ధరించి కార్యక్రమాల్లో పాల్గొని ఐక్యతను చాటాలన్నారు. అనంతరం మేడే ఉత్సవాలను పురస్కరించుకుని దాత భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి విరాళంగా ఇచ్చిన 100 ఎర్ర టీషర్ట్‌లను ఆయన కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ మండల కార్యదర్శులు రాజు, చిన్న రాముడు, స్థానిక నాయకులు మధు, బజారి, సుంకన్న, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, మనీ, చిన్న బజారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- గూడూరులోనూ కార్మిక సంఘాల నాయకులతో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ మంగళవారం సమావేశమై మేడే జయప్రదంపై చర్చించారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక నాయకులు లక్ష్మన్న, శివ, మద్దిలేటి, మురళీ, దాసు, శివ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

కర్నూలు(రూరల్): నగర సమీపంలో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- రైతుబజార్‌ను త్వరితగతిన ప్రారంభించాలి
- కేవీపీఎస్ నాయకులు డిమాండ్



రైతుబజార్‌ను సందర్శించిన కేవీపీఎస్ నాయకులు

కల్లూరు: ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేవీపీఎస్ నగర సహాయ కార్యదర్శి ఎం.సి.ఆనంద్ అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు గంగావతి నగర్‌లో ప్రారంభానికి నోచుకోని రైతు బజార్‌ను కేవీపీఎస్ నాయకులు సందర్శించారు. వారు మాట్లాడుతూ.. రైతు బజార్ నిర్మాణం పూర్తయి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంతవరకు ప్రారంభించకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని మండిపడ్డారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. గంగావతి నగర్‌లో రైతు బజార్ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల గ్రామాలైన బస్తిపాడు, లక్ష్మీపురం, బొల్లవరం, పందిపాడు, కల్లూరు ఎస్టేట్, ముజఫర్ నగర్, మాదిరాజు నగర్, సుందరయ్య నగర్, చింతలముని నగర్, శరీన్ నగర్ ప్రాంతాల ప్రజలకు ఉపయోగం ఉంటుందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే రైతుబజార్‌ను ప్రారంభించాలన్నారు. కేవీపీఎస్ నాయకులు రామాంజనేయులు, మహేష్, బీసన్న, రాజు, చిట్టిబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉద్యానవన, వ్యవసాయ సిబ్బంది, వాటర్‌షెడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వాటర్ షెడ్ల నిర్మాణంతో పాటు మట్టి పరీక్షల నమూనాలు సేకరించాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డుల పంపిణీ చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అమలును ప్రోత్సహించడం, ఉద్యానవన, మైక్రో ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో పంటల సాగులో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతుల అమలు, ఫారం పాండ్స్ ఏర్పాట్లపై చర్చించారు. మెట్ట ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎంఐపీ అధికారి ఉమాదేవి, ఉద్యాన శాఖాధికారి రామాంజనేయులు, ఏపీడీ మాధవీలత, డీపీఎం చంద్రశేఖర్, ఏఓ సుధాకర్, ఏపీఎం వెంకట్రామిరెడ్డి, ఉద్యానశాఖ అధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీశ్రీ జయంతి

కర్నూలు కల్చరల్: దేవీ ప్రసన్న సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ బి.వి.స్వరూప్ సిన్హా తెలిపారు.